సాక్షి
ఖమ్మం
శనివారం। 15। మార్చి। 2025

ఖమ్మం మమత రోడ్డులో జరిగిన హోలీ వేడుకల్లో యువత



దోలు వాయిస్తున్న యువతి





చిన్నారికి రంగులు పూస్తున్న కుటుంబీకులు



హోలీ వేడుకల్లో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్, జెడ్పీ సీఈఓ దీక్ష తదితరులు



నృత్యం చేస్తున్న యువతి

రంగుల హరివిల్లు..

ఊరువాడ ఘనంగా హోలీ వేడుకలు

జిల్లావాసులు హోలీ వేడుకలు శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరంగా గడిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లలో సామూహికంగా రంగుల పండుగ జరుపుకోగా.. పలువురు జట్లుగా విడిపోయి స్నేహితుల ఇళ్లకు వెళ్లి రంగులు పూసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక పోలీసు కమిషనర్ నివాసంలో జరిగిన వేడుకల్లో సీపీ సునీల్‌దత్, ఆదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్ఓ విక్రమ్ సిద్ధార్థ్ సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ట్రెయినీ ఐపీఎస్ సాయిరుత్విక్ తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

-9లో

ఇఫ్తార్
(శనివారం సా॥)
6.24

సహర్
(ఆదివారం ఉ॥)
5.00

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సూపరింటెండెంట్, ఇద్దరు వార్డర్లపై వేటు

- సత్తుపల్లి సబ్‌జైల్ ఉద్యోగుల సస్పెన్షన్
- ఇటీవల రిమాండ్ ఖైదీ తప్పించుకోవడంతో చర్యలు



సత్తుపల్లి సబ్‌జైల్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎస్.ప్రవీణ్, వార్డర్లు ఎస్.మారేశ్వరరావు, బి.శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11వ తేదీన అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన రిమాండ్ ఖైదీ పెండ్ర రమేష్ సబ్‌జైల్ నుంచి పరారయ్యాడు. భార్యపై హత్యాయత్నం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన పరారు కాగా, మూడు గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారు. ఈమేరకు జైళ్ల శాఖ డీఐజీ ఎం.సంపత్ ఈనెల 12వ తేదీన విచారణ నిర్వహించారు. ఈమేరకు బాధ్యతారహితంగా వ్యవహరించారని తేలుస్తూ జైలు సూపరింటెండెంట్, ఇద్దరు వార్డర్లను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మధిర సబ్ జైల్ హెడ్‌వార్డర్ ఎ.వెంకటమురళిని సత్తుపల్లి సబ్‌జైలుకు బదిలీ చేయగా ఆయన శుక్రవారం విధుల్లోకి చేరారు. అలాగే, సూపరింటెండెంట్‌గా మధిర సబ్ జైల్ సూపరింటెండెంట్ యు.కుటుంబరాజును నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తులు



ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(గతంలో ఎస్డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 25వరకు ఉందని ఖమ్మం అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎంకామ్, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అవకాశముందని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో చేయొచ్చని, వివరాలకు 98492 50633, 80088 11998 నంబర్లలో సంప్రదించాలని లేదా కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

పోస్టాఫీస్ ద్వారా రామయ్య పరోక్ష సేవలు



భద్రాచలం: పోస్టాఫీస్ ద్వారా భద్రగిరి రామయ్య పరోక్ష సేవలు అందించడానికి తపాలా శాఖ సిద్ధమైంది. శ్రీ సీతారాముల కల్యాణం, మహాపట్టాభిషేకంలో స్వయంగా పాల్గొనలేని భక్తులు సమీపాన పోస్టాఫీస్‌కు వెళ్లి అంతరాలయ అర్చన, తలంబ్రాలకైతే రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150 చొప్పున చెల్లించి పూర్తి చిరునామా, వివరాలతో దరఖాస్తు అందజేయాలి. ఆపై స్వామి వారి తలంబ్రాలు భక్తులకు చేరవేస్తామని, ఈ అవకాశం ఏప్రిల్ 1వ తేదీ వరకే ఉంటుందని ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి, భద్రాచలం హెడ్ పోస్టాఫీస్ పోస్‌మాస్టర్ బీ.వీ.రామ్మోహన్‌రావు తెలిపారు.

అడగడుగునా మోసం..దగా



నిత్యం ఉపయోగించే ఉప్పు, పప్పు మొదలు ఫోన్లు, టీవీలు ఇలా ఏదైనా సరే డబ్బు చెల్లించి కొంటున్న వారంతా వినియోగదారులే. కానీ చాలా మంది నాణ్యత, ధరలు, ప్యాకింగ్‌లో తేడాతో మోసపోతున్నారు. వ్యాపారుల తీరుతో ఈ పరిస్థితి ఎదురవుతుండగా తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీల మాటే మరువడంతో మోసాల స్థాయి నానాటికీ పెరుగుతోంది. ఈ నేపథ్యాన నేడు(శనివారం) వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యాన పరిశీలించగా నాణ్యతలో లోపాలే కాక కల్తీ జరుగుతున్నట్లు తేలింది.

1 ఖమ్మం గాంధీచౌక్: ఖమ్మం పాత బస్టాండ్ మొదలు వైరా రోడ్ ఆసాంతం పరిశీలిస్తే చాలా వరకు షాపుల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు కానరాలేదు. సాధారణ రాళ్లతోనే తూకం వేసి ఇస్తున్నా అర కేజీ, కేజీ సామర్థ్యం మేరకు బాట్లు ఉంటాయా అన్నది స్పష్టత రాలేదు. వీటిని ఏటా అధికారులతో తనిఖీ చేయించి స్టాంప్ వేయించాల్సి ఉన్నా అలాంటివేమీ తమకు తెలియదని వ్యాపారులు చెప్పారు. అధికారులెవరైనా తనిఖీకి వచ్చారా అంటే రావడం లేదని చెప్పడం గమనార్హం.



ప్రశ్నిద్దాం.. అది మన హక్కు -8లో

- తూనికలు, కొలతలతో పాటు నాణ్యతలోనూ నగుబాటే
- తనిఖీల మాటే మరిచిన శాఖ ఉద్యోగులు
- ఫలితంగా కొనసాగుతున్న వ్యాపారుల మోసాలు

నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఖమ్మంక్రైం: నిత్యం ఏదో ఒక వస్తువు కొనడం తప్పనిసరైన ఈ పరిస్థితుల్లో ఎక్కడైనా ఓ చోట మోసం సహజమైపోయింది. వీధివ్యాపారులు మొదలు బడా స్టోర్లలోనూ ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. ఇనుప కాంటాల్లోనే కాదు ఎలక్ట్రానిక్ కాంటాలను సైతం రీడింగ్ తగ్గించి తక్కువ తూకంతో సరుకులు అంటగడుతున్నారు.

తనిఖీల మాటే లేదు...

జిల్లాలో ఉన్న తూనికలు, కొలతల శాఖ(లీగల్ మెట్రాలజీ) పూర్తిగా నిర్వీర్యమైందనే చెప్పాలి. అరకొర దాడులతో ఏళ్ల తరబడి నెట్టుకొస్తుండడంతో వ్యాపారులకు భయం లేకుండా పోయింది. చాలామంది వ్యాపారులకు తూనికల కొలతల శాఖ ఉందని తెలియదంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ సిబ్బంది తనిఖీలకు వచ్చినా పెద్దగా జరిమానా లేకపోవడంతో కడతామని.. లేదా సిబ్బందికే డబ్బులు ఇస్తే వెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ఫలితంగా తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాంటాలను ఏటా బరువు నిర్ధారించి సీల్ వేయించుకోవాల్సిన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

నలుగురే సిబ్బంది

గతంలో ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో కొనసాగిన తూనికలు, కొలతల శాఖ కార్యాలయాన్ని ఇప్పుడు కలెక్టరేట్‌కు మార్చారు. అయితే, ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు ఎన్ని పోస్టులో ఇప్పుడూ అవే కొనసాగుతున్నాయి. కాగా, ఆరుగురు ఉద్యోగులకు గాను నలుగురు పనిచేస్తుండగా సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, అటెండర్ పోస్ట్ ఖాళీగా ఉన్నాయి. అలాగే, మహబూబాద్ జిల్లా తూనికల కొలతల శాఖాధికారే ఇక్కడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండడంతో అజమాయిషీ కరువైందని చెబుతున్నారు.

కొన్ని కేసులు.. కొంత జరిమానా

తూనికల, కొలతల శాఖ ఆధ్వర్యాన జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు తూకం రాళ్లు, ఎలక్ట్రానిక్ కాంటాలపై ముద్రలు వేయడం, లైసెన్స్‌ల జారీకి రూ.34,46,820 వసూలయ్యాయి. అలాగే, అక్రమ కాంటాలు,ప్యాకింగ్‌లు చేస్తున్న వారిపై 37 కేసులు నమోదు చేయగా, రూ.9,26లక్షల జరిమానా జమ అయింది. ఇక ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు అమ్ముతున్న వారిపై 37కేసులు నమోదయ్యాయి. ఇక ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ముద్రల కోసం రూ.8.05లక్షలు, జరిమానా రూ.3.10లక్షలు వసూలయ్యాయి. అలాగే, కాంటాలకు సంబంధించి పది కేసులు, ప్యాకింగ్‌లో అవకతవకలపై జరిమానాగా రూ.3లక్షల మేర వసూలు చేశామని జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌చార్జ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు ఎక్కడైనా మోసపోయినట్లు గ్రహిస్తే తమ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

2 ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీదీ లాభాల కోణంలో చూస్తున్న వ్యాపారులు ప్రజారోగ్యాన్ని అంగట్లో సరుకుగా మార్చేశారు. ఖమ్మం కిన్నెరసాని థియేటర్ సమీపాన ఓ హోటల్ ఖార్కానాను పరిశీలించగా.. కనీస నిబంధనలేమీ పాటించకుండా పిండివంటలు తయారు చేస్తున్నట్లు తేలింది. డ్రెయినేజీపైనే గ్యాస్ స్టౌలు ఏర్పాటుచేయగా, వాడిన నూనెనే మళ్లీ వాడుతుండడం, మిగిలిపోయిన పదార్థాలతో కొత్తవి తయారుచేస్తున్నట్లు కనిపించింది.



స్టాంప్ లేని బాట్లతో తూకం వేస్తున్న చిరువ్యాపారి

3 ఖమ్మం అర్బన్: చిరువ్యాపారులు కొందరు కళ్ల ముందే మోసం చేస్తున్నారు. ఇది మోసమని కూడా తెలియకపోవడంతో వినియోగదారులకు నష్టం ఎదురవుతోంది. చెరుకు రసం, కొబ్బరినీళ్లు ఇంటికి తీసుకెళ్లే వారు లీటర్, రెండు లీటర్ల చొప్పున బాటిళ్లు ఎంచుకుంటారు. అయితే, ఓ చోట పరిశీలించగా లీటర్ బాటిల్‌గా చెప్పిన సీసాలో 700 ఎం. ఎల్.కు మించి పట్టలేదు.



లీటర్ నీళ్లు పడతాయని చెబుతున్న 700 మి.లీ. బాటిల్

■ ఖమ్మంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి సుబ్బారావు నెల జీతం రాగానే షాప్‌నకు వెళ్లి కిరాణా సరుకులు తీసుకొచ్చాడు. ఆయన ముందే అన్నింటినీ ఎలక్ట్రానిక్ కాంటాపై తూకం వేసి ప్యాక్ చేశారు. ఇంటికి వచ్చాక ఆయన భార్యకు అనుమానం వచ్చి సమీపంలోని షాపులో తూకం వేయించగా ఒక్కో ప్యాకెట్‌కు 100నుంచి 150గ్రాముల వరకు తక్కువగా వచ్చింది.

■ గ్రామాల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ దుస్తులు అమ్మే రామయ్య రోజుకు రెండు లీటర్ల పెట్రోల్ పోయిస్తాడు. ఇదే తరహాలో ఓ రోజు వెళ్తుండగా మధ్యలో వాహనం ఆగిపోయింది. ఏదో సమస్య ఉందని భావించి పరిశీలించినా ఏదీ తేలలేదు. చివరకు ఆ గ్రామ యువకులు పరిశీలించి పెట్రోల్ అయిపోయిందని చెప్పగా ఎండలో మూడు కి.మీ. మేర వాహనం తోస్తూ వచ్చాడు. ఎప్పుడూ వెళ్లే బంక్‌కు కాకుండా ఇంకో బంక్‌కు వెళ్లడంతో పెట్రోల్ తక్కువగా పోసి తనను మోసం చేశారని రామయ్యకు అర్థమైంది.

నాణ్యతలో రాజీ పడొద్దు..

- లిఫ్ట్ పనులు సకాలంలో పూర్తిచేయాలి
- మంచుకొండ ఎత్తిపోతల పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల




పంపుహౌస్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగర్ నీరు అందించడానికి రూ.66 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు నాణ్యతగా చేస్తూనే సకాలంలో పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని వీ.వీ.పాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వకు ఆనుకుని నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఉగాది నాటికి ట్రయల్ రన్ జరిపేలా పనుల్లో వేగం పెంచాలని, ఓవైపు పంప్‌హౌస్, మరోవైపు పైపులైన్ పనులు చేపడితే సకాలంలో పూర్తవుతాయని తెలిపారు. తద్వారా సాగర్ జలాలను మండలంలోని చెరువుల్లో నింపి సాగుకు ఇబ్బంది లేకుండా చూడొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, మార్కెట్, ఆత్మ, సొసైటీల చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రావూరి సైదబాబు, తాతా రఘురాంతో పాటు తమ్మిన్ని నాగేశ్వరరావు, బండి వెంకన్న, రెంటాల ప్రసాద్, రమేష్, లాలు తదితరులు పాల్గొన్నారు.

భగభగమంటున్న భానుడు

జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎండ తీవ్రత నానాటికీ పెరుగుతోంది. అనేక ప్రాంతాల్లో శుక్రవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వైరాలో అత్యధికంగా 40.8 డిగ్రీలుగా నమోదు కాగా, ముదిగొండ, సింగరేణి, సత్తుపల్లి, పెనుబల్లి, రఘునాథపాలెం, ఎర్రుపాలెం, వేంసూరు, మధిర మండలాల్లో దాదాపు అదే పరిస్థితి నెలకొంది. మిగిలిన మండలాల్లో 37.2 – 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9గంటలకే ఎండ మొదలై 11 గంటలకల్లా తీవ్రత పెరుగుతుండడంతో మధ్యాహ్నం ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. అలాగే, యాసంగి పంటలు చేతికందుతున్న వేళ ఎండలతో రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారు.

కోటాకు మించి విద్యుత్ వినియోగం

ఉష్ణోగ్రతల ప్రభావం విద్యుత్ వినియోగంపై పడింది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కోసం ఏసీలు, ఫ్యాన్ల వినియోగం పెరగగా.. అదే స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదవుతోంది. జిల్లాకు కేటాయించే కోటాకు మించి విద్యుత్ వినియోగం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. నిత్యం జిల్లా విద్యుత్ కోటా 6.96 మిలియన్ యూనిట్లు కాగా, మార్చి ఆరంభం నుంచి నిత్యం 9మిలియన్ యూనిట్ల మేర వినియోగం జరుగుతోందని, ఈనెల 2, 4, 7వ తేదీల్లో అత్యధికంగా 9.02 నుంచి 9.09 మిలియన్ యూనిట్లు దాటిందని సమాచారం. గత ఏడాది మార్చి 1 నుంచి 13వ తేదీ వరకు జిల్లాలో 100.68 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించగా, ఈ ఏడాది 115.57 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

జానకీ సదనానికి రూ.6లక్షల విరాళం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యాన నిర్మించే జానకీ సదనంలో ఓ గది నిర్మాణానికి దాతలు శుక్రవారం రూ.6 లక్షల విరాళం అందజేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ఎస్.కృష్ణదేవరాయులు – అచల దంపతులు, శాంత పార్వతిదేవి, ఎస్.విజయలక్ష్మీదేవి ఉమ్మడిగా చెక్కు రూపంలో విరాళం అందజేశారని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, దాతలు, వారి కుటుంబ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ద్వారా నిరుద్యోగ బీసీ యువతకు హైదరాబాద్‌లోని హకీంపేటలో ఆర్టీసీ ద్వారా డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. హెచ్ఎంవీ(హెవీ మోటర్ వాహనం), ఎల్ఎంవీ(తేలికపాటి మోటార్ వాహనం) డ్రైవింగ్‌లో 38 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆతర్వాత అర్హత సాధించిన వారికి పర్మనెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తారని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. అలాగే, శిక్షణ సమయంలో ఆర్టీసీ ద్వారా ఉచిత వసతి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువకులు తమ కార్యాలయంలో ఈనెల 31వ తేదీలోగా సంబంధిత సర్టిఫికెట్లు జతపరిచిన దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో శ్రీ అంకమ్మ జాతర సందర్భంగా రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అమరగాని ఎల్లయ్య తెలిపారు. చెరువుమాధారంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు జరిగే పోటీల్లో మొదటి ఆరు స్థానాల్లో నిలిచే జట్లకు రూ.30 వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేల నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన సౌకర్యం ఉంటుందని తెలిపారు. జట్ల వివరాలు నమోదు చేసేందుకు 63026 47907, 81427 14306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఈవూరి శ్రీనివాసరెడ్డి, కనమర్లపూడి రాము, తుమ్మా ధనమూర్తి, ఆకుల వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేష్, గుంజి రవి తదితరులు పాల్గొన్నారు.

రైసెట్‌లో ఉచిత శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని తరుణి హాట్‌లో ఉన్న రైసెట్ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ సి.చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా నెల పాటు కొనసాగే లేడీస్ టైలరింగ్‌లో శిక్షణకు ఈనెల 21నుండి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించడమే కాక యూనిఫామ్, ట్రెనింగ్ మెటీరియల్, టూల్ కిట్ ఇస్తామని తెలిపారు.

కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఖమ్మంవ్యవసాయం: ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల(కిచెన్ గార్డెన్) పెంపకానికి ఉద్యాన యూనివర్సిటీ ఇటీవల ప్రతిపాదించింది. ఈమేరకు ప్రభుత్వం అనుమతిస్తే ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ పర్యవేక్షణలో జిల్లాలోని వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల ద్వారా ఆకుకూరలు, కూరగాయలు, మునగ, కరివేపాకు, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కల పెంపకం చేపట్టనున్నారు. తద్వారా విద్యార్థుల్లో పంటల సాగుపై అవగాహన కల్పించడమే కాక, పంటలను వంటల్లో వినియోగానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్లు ఉద్యాన శాఖ అధికారుల ద్వారా తెలిసింది.

నేడు భీమ్ దీక్షలు ప్రారంభం



దీక్ష పోస్టర్లు ఆవిష్కరిస్తున్న స్వేరోస్ బాధ్యులు

నేలకొండపల్లి/ఖమ్మంమయూరిసెంటర్: స్వేరోస్ ఆధ్వర్యాన పలువురు భీమ్ దీక్షను మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రం వద్ద శనివారం స్వీకరించనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 500 మందికి పైగా దీక్ష చేపడతారని చెబుతుండగా, స్వేరోస్ వ్యవస్థాపకుడు, పూర్వ గురుకులాల సంస్థ కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించనున్నారు. శనివారం నుంచి ఏప్రిల్ 14 వరకు వీరు దీక్షలో ఉంటారని తెలంగాణ స్వేరోస్ కన్వీనర్ బి.దర్గయ్య తెలిపారు. ఈమేరకు క్షేత్రం వద్ద ఆయన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతూ మహనీయులు జయంతి సందర్భంగా 2012 నుంచి దీక్షలు స్వీకరిస్తున్నామని వివరించారు. కాగా, దీక్ష పోస్టర్లను శుక్రవారం ఖమ్మంలో ఆవిష్కరించగా స్వేరో రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్యతో పాటు దేవరగట్టు బాలప్రసాద్, మొండితోక ఈదయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1.11 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న వసంత్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి శివ టెంట్‌హౌస్ నిర్వాహకులు సాధు వసంత్ – సునీత శుక్రవారం రూ.1.11 లక్షలను విరాళంగా అందించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జున శర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.


లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన వారిని కాపాడిన పోలీసులు

ఖమ్మంక్రైం: లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ఓ దినపత్రిక జర్నలిస్టులను ట్రాఫిక్ పోలీసు సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. పలువురు జర్నలిస్టులు ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌కు శుక్రవారం వెళ్లగా.. కిందకు దిగే సమయాన లిఫ్ట్ మధ్యలో ఆగిపోయింది. దీంతో వారు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిబ్బందితో పాటు సమీపంలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ ప్రసాద్ చేరుకున్నారు. లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య పరిష్కరించేందుకు సాయపడగా అంతా కిందకు దిగడంతో ఊపిరి పీల్చుకుని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశ్నిద్దాం.. అది మన హక్కు

- వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం
- 1986లో ఏర్పాటు.. 2019లో మరింత బలోపేతం
- ఇప్పటివరకు జిల్లాలో 10,206 కేసులు.. 10,055 పరిష్కారం

నేడు వినియోగదారుల హక్కుల దినోత్సవం



జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో నమోదైన కేసులు

ఏడాది	కేసులు
2021	100
2022	172
2023	138
2024	102
2025(ఇప్పటివరకు)	27

ఖమ్మంలీగల్: కొనుగోళ్లు, సేవల కోసం డబ్బు చెల్లించే ప్రతీఒక్కరు వినియోగదారులుగానే పరిగణనలోకి వస్తారు. ఈసమయాన నాణ్యతను ప్రశ్నించడం, రశీదు తీసుకోవడం, ధరల తెలుసుకోవడం హక్కుగా సంక్రమిస్తాయి. అదేసమయాన చౌకబారు, నాణ్యత లేని వస్తువులు వచ్చినట్లు తెలిస్తే ప్రశ్నించడం కూడా వినియోగదారుల హక్కుగానే భావించాలి. నేడు(శనివారం) వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హక్కుల రక్షణకు ఉన్నచట్టం, ఫిర్యాదు చేయాల్సిన తీరు, ఇటీవల వెలువడిన తీర్పులపై కథనం

న్యాయం.. నష్టపరిహారం

వినియోగదారుల రక్షణ చట్టం -1986 ద్వారా ఫిర్యాదు వినడంతో పాటు న్యాయం చేయడమే కాక నష్ట పరిహారం ఇప్పించడానికి ఒక వ్యవస్థ ఏర్పడింది. ఈ చట్టం 1986లో వచ్చింది. అంతకు ముందు వినియోగదారులు 40 రకాల చట్టాలపై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో ఇంగ్లాండ్, అమెరికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేశాక ప్రత్యేక తీసుకొచ్చారు. ఆ తర్వాత 2019లో మరింత బలోపేతం చేస్తూ కొత్త చట్టం ఏర్పరిచారు. అంతర్జాల వేదికలు, ఈ-కామర్స్ ద్వారా కూడా రక్షణ లభించేలా ఇందులో నిబంధనలు పొందుపరిచారు. చట్టం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 10,206 కేసులు నమోదు కాగా.. వీటిలో 10,055 పరిష్కారమయ్యాయి.

> ధంసలాపురానికి చెందని తుమ్మ అప్పిరెడ్డి భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్లేందుకు హైదరాబాద్‌లోని అర్చన ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టూర్ ఆపరేటర్ బద్దం బోజిరెడ్డి ద్వారా 2023 ఏప్రిల్‌లో రూ.71వేలు చెల్లించి ప్యాకేజీ తీసుకొన్నారు. ఆపై రకరకాల కారణాలతో వాయిదా వేస్తుండగా, అప్పిరెడ్డి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కారం కమిషన్‌ను ఆశ్రయించారు. విచారణ చేసిన అనంతరం టూర్ కోసం చెల్లించిన రూ.71వేలు, కేసు నమోదు చేసిన నాటి నుంచి ఏడు శాతం వడ్డీతో కలిపి చెల్లించడమే కాక ఇబ్బందికి వేదనకు రూ.10వేలు, లిటిగేషన్ ఖర్చులకు రూ.10వేలు కూడా చెల్లించాలని తీర్పునిచ్చింది.



జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్

చట్టం లక్ష్యాలు

దోపిడీకి గురైన, మోసపోయిన, దొంగ వ్యాపారంతో విసిగిపోయిన వినియోగదారులకు రక్షణ కవచంలా ఈ చట్టం ఉపయోగపడుతుంది. కష్టాలు, నష్టాలు, కడగండ్ల నుంచి తప్పించడానికి సాయపడుతోంది. సాధారణ, తక్కువ ఖర్చు, కాలయాపన లేకుండా న్యాయం చేకూర్చడమే ఈ చట్టం ఉద్దేశం.

ఫిర్యాదులు

జిల్లా పరిధిలో ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటైంది. ఎవరైనా వ్యక్తిగా, సామూహికంగా ఫిర్యాదు చేయొచ్చు. అలాగే, కేంద్ర, రాష్ట్ర, జిల్లాస్థాయిలో మూడంచెలుగా న్యాయవ్యవస్థ, జాతీయ కమిషన్, రాష్ట్ర వినియోగదారుల వివాదాల నివారణ కమిషన్, జిల్లా స్థాయిలో వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటైంది. కొన్న వస్తువులు పాడైనా, నాసిరకంవి వచ్చినా, ఆశించిన రీతిలో లేకున్నా, లోపాలు ఉన్నా, అధికధర వసూలు చేసినా రాతపూర్వకంగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయొచ్చు.

జరిమానా.. శిక్షలు

ఎవరికి వ్యతిరేకంగానైతే ఉత్తర్వులు జారీ అవుతాయో, వాళ్లు ఆ ఉత్తర్వులను అమలుపర్చకపోతే వారికి శిక్ష విధించే అధికారం ఫోరమ్‌లు, కమిషన్లకు ఉంటుంది. వ్యక్తికి నెల తగ్గకుండా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ.2వేలు తగ్గకుండా రూ.10వేల వరకు జరిమానా లేదా ఈ రెండింటినీ విధించవచ్చు. అయితే, వీటిపై అప్పీల్‌కు వెళ్లొచ్చు.

ఫిర్యాదు చేయడం ఇలా...

వస్తువు ధర ఆధారంగా రూ.50లక్షల నష్టపరిహారం వరకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఫిర్యాదు చేసే అవకాశముంది. ఇక రూ.50లక్షలకు పైన రాష్ట్ర వినియోగదారుల ఫోరం, ఆపైన జాతీయ వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలి. కోర్టు రుసుముతో పాటు ఫిర్యాదు ఆధారంగా ఫీజు చెల్లించి పూర్తి వివరాలు సమర్పించాలి. వినియోగదారుల తరఫున న్యాయవాది లేదా సొంతంగానూ వాదనలు వినిపించవచ్చు. అయితే, వివాదం తలెత్తిన రెండేళ్ల లోపు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. e.jagrithi.gov. in ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇతర వివరాల కోసం 08742- 254347 నంబర్‌లో సంప్రదించవచ్చు.

> తల్లాడ మండలం మల్లవరానికి చెందిన దుగ్గిదేవర వెంకటలాల్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నాడు. కోవిడ్ బారిన పడిన ఆయన ఆస్పత్రిలో చికిత్సకు రూ.54,963 బిల్లు చెల్లించాడు. ఈ బిల్లు ఇవ్వాలని బీమా కంపెనీని సంప్రదిస్తే నిరాకరించారు. దీంతో సేవాలోపం కింద ఆయన జిల్లా వినియోగదారుల కమిషన్‌లో 2022 జనవరి 28న ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఇరుపక్షాల వాదనలు విన్న సేవా లోపం జరిగిందని నిర్ధారించారు. దీంతో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ(వనస్థలిపురం) తరఫున ఫిర్యాదికి రూ.73,707 చెల్లించాలని తీర్పు చెప్పారు.

కొలువు.. మాకిది సులువు..

- పట్టుబట్టారు.. ఉద్యోగాలు సాధించారు..
- ఒకటికి మించి జాబ్‌లు కొల్లగొట్టిన యువత
- ఇప్పటికే ఉద్యోగాలు చేస్తూనే విజయకేతనం ఎగురవేసిన కొందరు
- గ్రూప్ 1, 2, 3కి తోడు జేఎల్‌గా ఎంపికైన పలువురు

యువత అనుకుంటే సాధించలేనిదేదీ లేదని, కొలువు కొట్టడం మాకెంతో సులువైన పని అని కొందరు నిరూపించారు. స్పష్టమైన లక్ష్యాలు ఉండడం లేదని, గాలివాటంగా వెళ్తున్నారని కొన్ని కుటుంబాల్లో పెద్దల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ ఇంకొందరు మాత్రం వాటిని పటాపంచలు చేస్తూ సత్తాచాటుతున్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్ – 1, 2, 3 ఫలితాలతోపాటు జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన వారిని పరిశీలిస్తే ఎంతో కఠోర శ్రమ.. పట్టుదల చూపించి.. ఉద్యోగాలు సాధించారని వెల్లడవుతోంది. స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాక నిరంతరం శ్రమించడం, ఒక ఉద్యోగం వచ్చినా పట్టు వీడకుండా మరిన్ని ఉద్యోగాలు సాధిస్తున్న యువత ఇంకొందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి..



కటికి ఉపేంద్ర

తల్లాడ: మండలంలోని మల్లవరానికి చెందిన కటికి ఉపేంద్రకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా వదులుకుని ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించాడు. తాజాగా ఆయన గ్రూప్–3లో 384వ ర్యాంక్ సాధించాడు. ఆయన రెండేళ్ల వయస్సులోనే తండ్రి బాబూరావు ప్రమాదవశాత్తు మృతి చెందగా తల్లి ప్రోత్సాహంతో పట్టుదలగా చదివాడు. ఆయన 1 - 4వ తరగతి వరకు సాయిచైతన్య, 5 - 10వ తరగతి వరకు బాలభారతి విద్యాలయం, ఇంటర్ ఖమ్మం రెజొనెన్స్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశాడు. తల్లి సాయమ్మ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉపేంద్రను పలువురు అభినందిస్తున్నారు.

ఉపాధ్యాయిని.. ఇప్పుడు లెక్చరర్



కళావతి

మధిర: మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన మాచారపు నాగేశ్వరరావు – సుబ్బమ్మ కుమార్తె కళావతి తల్లిదండ్రులు, భర్త పోలిశెట్టి నాగరాజు ప్రోత్సాహంతో పాటు పట్టుదలగా చదివి ఉద్యోగాలు సాధిస్తోంది. ఆమె పదో తరగతిలోనే చదువు ఆపేసి టైలరింగ్ నేర్చుకోవాలని పలువురు సూచించినా తల్లిదండ్రుల సహకారంతో చదువు కొనసాగించింది. 1-5వ తరగతి వరకు రాయపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో, 6 – 10వ తరగతి వరకు బనిగండ్లపాడు సెయింట్ ఆన్స్‌లో, ఇంటర్ పల్లగిరిలోని మరియనివాస్‌లో, డిగ్రీ మధిర సుశీల కళాశాలలో పూర్తి చేశాక ఎంఏ ఇంగ్లిష్ కూడా చదివి ఎమ్మెస్సీ, బీఈడీ, ఎంఈడీ పూర్తిచేశారు. ఎంఈడీ కేయూ క్యాంపస్‌లో చదివిన ఆమె బంగారు పతకం సాధించింది. ఆపై డీఎస్సీ 2008 ద్వారా ఎంపీపీఎస్ అన్నాయిపాలెంలో ఎస్‌జీటీగా చేరిన కళావతి, మోడల్ స్కూల్‌లో పీజీటీ గణితం ఉపాధ్యాయినిగా ఎంపికై కరీంనగర్ జిల్లా ధర్మపురిలో పనిచేశారు. తాజాగా ఇంగ్లిష్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఆమె గురువారం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు.

గ్రూప్–2 ర్యాంకర్‌కు సన్మానం



గోపాల్‌రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

బోనకల్: మండలంలోని జానకీపురానికి చెందిన కోటా గోపాల్‌రావు గ్రూప్–2 ఫలితాల్లో 652వ ర్యాంక్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ 2020లో సివిల్ కానిస్టేబుల్‌గా, 2024లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌తో పాటు గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మధిర తహసీల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రూప్–2లో ర్యాంక్ సాధించిన గోపాల్‌రావును గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు.

సౌమ్య.. గ్రూప్–2, 3లో ర్యాంక్‌లు



కల్యాణపు సౌమ్య

బోనకల్: గ్రూప్–2, 3 ఫలితాల్లో మండలంలోని గోవిందాపురం(ఎల్)కి చెందిన కల్యాణపు సౌమ్య మెరుగైన ర్యాంకులు సాధించింది. ఈ నెల 12న విడుదల చేసిన గ్రూప్–2 ఫలితాల్లో 533, శుక్రవారం వెల్లడైన గ్రూప్–3లో 191వ ర్యాంక్ సాధించడం విశేషం. గతంలో బోనకల్ మండలం రామాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఆమె సెలవు పెట్టి పరీక్షలకు సిద్ధమై మెరుగైన ర్యాంకులు సాధించగా పలువురు అభినందించారు.

అన్నదమ్ములు.. 'జాబ్'పాట్



తల్లిదండ్రులతో రత్నేశ్వరనాయుడు, సాయికృష్ణమ నాయుడు

కామేపల్లి: మండలంలోని గోవింద్రాలబంజరకు చెందిన గంగారపు సత్యనారాయణ – జ్యోతిర్మయి కుమారులు సాయికృష్ణమనాయుడు, రత్నేశ్వరనాయుడు ఏ పరీక్ష రాసినా విజయం సొంతమవుతోంది. గ్రూప్–1, 2, 3 ఫలితాల్లో అన్నదమ్ములు సత్తా చాటడం విశేషం. సాయికృష్ణమనాయుడు గ్రూప్–1లో 435 మార్కులు, గ్రూప్–3లో 578 ర్యాంక్ సాధించగా ఇప్పటికే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇక రత్నేశ్వరనాయుడు గ్రూప్–1లో 467 మార్కులు, గ్రూప్–2లో 197వ ర్యాంక్, గ్రూప్–3లో 27వ ర్యాంక్ సాధించి వరుస విజయాలు కైవసం చేసుకున్నాడు. ఆయన ప్రస్తుతం సీటీఓలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు.

లోక్యాతండాలో ప్రారంభమైన హోలీ వేడుకలు



సామూహిక కోలాటంలో తండావాసులు

మూడు రోజుల పాటు సాగనున్న సంబురాలు

కూసుమంచి: అన్నిచోట్ల ఒకేరోజు హోలీ ఆడితే కూసుమంచి మండలం లోక్యాతండాలో మాత్రం మూడు రోజుల పాటు సందడి ఉంటుంది. ఈ మూడు రోజులు తండావాసులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా.. మొదటిరోజైన శుక్రవారం కోలాటంతో వేడుకలు మొదలయ్యాయి. శనివారం తెల్లవారుజామున కామదహనం చేస్తారు. అనంతరం మధ్యాహ్నం నుంచి తండాలో గత హోలీ నుంచి ఇప్పటి వరకు మగబిడ్డ పుట్టిన ఇంట దూండ్ వేడుక(అన్నప్రాసన, నామకరణం)లు నిర్వహించనున్నారు. ఇక మూడోరోజైన ఆదివారం తండావాసులు రంగులు చల్లుకోవడంతో వేడుకలు ముగిస్తాయి. ఇందులో పాల్గొనేందుకు ఉద్యోగ, వ్యాపార నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన తండావాసులే కాక బంధువులు రావడంతో స్థానికంగా సందడి నెలకొంది. కాగా, తొలి రోజు తండావాసులు గ్రామ కూడలిలో చేరి కోలాటమాడారు. చిన్నాపెద్ద తేడా లేకుండా పాల్గొని సంప్రదాయ తలపాగ, పంచెకట్టుతో ఆకట్టుకున్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల ఫోరం కమిటీ ఎన్నిక



కమిటీ బాధ్యులతో టీఎన్జీవోస్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల ఫోరం కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఖమ్మంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కేవీఎస్.రాజు, కార్యదర్శిగా ఇమామ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిండిప్రోలు సబ్‌స్టేషన్‌కు ఇంటర్‌లింక్ లైన్



లైన్‌ను చార్జ్ చేశాక ఉద్యోగులతో ఎస్ఈ శ్రీనివాసాచారి

తిరుమలాయపాలెం: వేసవి కార్యాచరణలో భాగంగా శుక్రవారం మండలంలోని పిండిప్రోలు సబ్‌స్టేషన్‌కు అనుసంధానంగా కొత్త 33 కే.వీ. ఇంటర్‌లింక్ లైన్ ఏర్పాటుచేశారు. ఈ లైన్‌ను ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి శుక్రవారం చార్జ్ చేశాక మాట్లాడారు. ఇంటర్ లింక్ లైన్‌తో పిండిప్రోలు, తిప్పారెడ్డిగూడెం, హైదర్‌సాయిపేట ఉపకేంద్రాలకు అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా చేయొచ్చని చెప్పారు. ప్రస్తుతం ఆరెంపుల, కూసుమంచి, మరిపెడ 132 కే.వీ. సబ్ స్టేషన్ నుంచి సరఫరా చేస్తున్నా, సాంకేతిక కారణాలతో ఇబ్బంది ఎదురైతే ప్రత్యామ్నాయ లైన్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఖమ్మం రూరల్ డీఈఓ సీహెచ్.నాగేశ్వరావు, ఏడీఈ బి.రామకృష్ణ, ఏఈలు ఆర్.భాస్కర్, కిలారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై బీఆర్‌ఎస్ నిరసన



నిరసనలో పాల్గొన్న కమల్‌రాజ్, నాయకులు

మధిర: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈమేరకు మధిర వైఎస్సార్ చౌరస్తాలో శుక్రవారం జరిగిన నిరసనలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యాన్ని ప్రశ్నించడమే కాక అక్రమాలపై నిలదీస్తుండడంతోనే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. నాయకులు బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, వై.వీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, షేక్ ఖాదర్, వేమిరెడ్డి పెదనాగిరెడ్డి, ఆళ్ల నాగబాబు, పరిశ శ్రీనివాసరావు, కొత్తపల్లి నర్సింహారావు, షేక్ సైదా, అబ్దుల్ ఖురేషి, పట్టాభి రామశర్మ, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఎర్రుపాలెం: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములుగుమాడు గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు (37) తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. తర్వాత చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతుడి భార్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



శ్రీనివాసరావును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మధిర: భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని మధిర టౌన్ పోలీసులు అతని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఖమ్మం త్రీటౌన్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసరావు తన భార్యతో గొడవపడి శుక్రవారం ఇంటి నుంచి వెళ్లాడు. శ్రీనివాసరావు కుమారుడు సాయికుమార్ తన తండ్రి మధిరలో ఉన్నాడని తెలుసుకుని 100కు సమాచారం అందించాడు. మధిర టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కొట్టే రిత్విక సాయి ఐపీఎస్ అతని లొకేషన్ ద్వారా ఇంటి నుంచి వెళ్లిపోయిన శ్రీనివాసరావు ఆచూకీని తెలుసుకున్నారు. మధిర రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి ఎస్సై చంద్రశేఖరరావు అతనిని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బ్లూ కోర్టు కానిస్టేబుల్ కొండ, మల్లికార్జున్ ద్వారా సాయికుమార్‌కు అతని తండ్రిని అప్పగించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులు టౌన్ ఎస్‌హెచ్‌ఓ సాయికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపాన శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు తెలిసింది. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తుండగా వారి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అల్లీపురానికి చెందిన యువతి(26) కానపడకుండా పోవడంతో ఆమె కుటుంబీకుల ఫిర్యాదుతో శుక్రవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె బయటకు వెళ్లగా ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

దుకాణంలో చోరీ..

వైరా: తాళం వేసి ఉన్న ఓ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి అందులోని నగదుతో పాటు విలువైన సరుకులు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. వైరాలోని మధిర రోడ్డులో వెంకటేశ్వర ట్రేడర్స్ పేరుతో కొల్లా సత్యనారాయణ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి సుమారు 9.30 గంటలకు దుకాణాన్ని మూసి తాళం వేసి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఆ షాపు దగ్గరకు రాగా.. అది తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. అందులోని రూ.50 వేల నగదు, రూ.70 వేల విలువైన సరుకులు దొంగిలించినట్లు గ్రహించాడు. ఈమేరకు పోలీసులకు దుకాణ నిర్వాహకుడు ఫిర్యాదు చేశాడు.